# నమస్తే తెలంగాణ

# హనుమకొండ

5 | వరంగల్, సోమవారం 6 జనవరి 2025 | HANUMAKONDA


### ఆకలి తీర్చితేనే ఏకాగ్రత



పదో తరగతి విద్యార్థులకు ఇప్పటికే ప్రత్యేక తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ సమయంలో వారికి అల్పాహారం అందించాల్సి ఉంది. కానీ అందడం లేదు. దాతలు, ప్రభుత్వం ముందుకు వచ్చి అందిస్తే ఏకాగ్రతతో ఉత్తమ ఫలితాలు సాధిస్తారు. ఈసారి 100 శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ప్రత్యేక దృష్టి సారించాం. గతేడాది కలెక్టర్ ఆదేశాలతో పదో తరగతి విద్యార్థులకు రూ.16 వేలు ఖర్చు చేసి స్నాక్స్ అందించాం. ప్రభుత్వం ఇప్పటి వరకు ఆ బిల్లులు కూడా ఇవ్వలేదు. – *ఎన్ లక్ష్మీప్రసన్న, హెచ్ఎం, భూపాలపల్లి ఉన్నత పాఠశాల*

### స్నాక్స్ ఇవ్వండి



పొద్దున్నే బడికి వస్తున్నం. వచ్చాక మధ్యాహ్న భోజనం చేస్తున్నం. ఆ తర్వాత సాయంత్రం ఆరు గంటల వరకు మళ్లీ స్టడీ అవర్స్ ఉంటుంది. అప్పుడు ఆకలైతాంది. పాఠాలు అర్థం కాక సతమతమవుతున్నం. ఈ సమయంలో మాకు స్నాక్స్ ఇస్తే ఆకలి తీరుతుంది. ప్రభుత్వం అల్పాహారం అందించేలా చర్యలు తీసుకోవాలి.

*–దాసరి గౌతం, పదో తరగతి విద్యార్థి, భూపాలపల్లి*



**పదో తరగతి పరీక్షల్లో జయశంకర్ భూపాలపల్లి జిల్లాను అగ్రస్థానంలో నిలపాలని సంబంధిత విద్యాశాఖాధికారులు విద్యార్థులకు ఆరు గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. మధ్యాహ్న భోజనం తర్వాత ఎటువంటి అల్పాహారం ఇవ్వకపోవడంతో వారు ఖాళీ కడుపులతో చదువుతున్నారు. దీంతో తమ పిల్లలు నీరసించి పాఠాలు అర్థంకాక సతమతమవుతున్నారని తల్లిదండ్రులు వాపోతున్నారు. గతేడాది బీఆర్ఎస్ సర్కారులో స్నాక్స్ అందించగా, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం చేతులెత్తేయడంతో విద్యార్థులు అర్ధాకలితో అలమటిస్తున్నారు. వెంటనే అల్పాహారం అందించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.**

**- భూపాలపల్లి రూరల్, జనవరి 5**

**టెన్త్ విద్యార్థులకు అందని అల్పాహారం**

# ఖాళీ కడుపులు.. చెవికెక్కని చదువులు

### ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాలే..



నవంబర్ 1 నుంచి జిల్లాలోని పదో తరగతి విద్యార్థులకు స్పెషల్ క్లాసులు ప్రారంభమయ్యాయి. గతేడాది కలెక్టర్ ఆదేశాల మేరకు విద్యార్థులకు స్నాక్స్ అందించాం. జిల్లాలో మొత్తం 3449 మంది విద్యార్థులు పదో తరగతి వార్షిక పరీక్షలకు హాజరుకానున్నారు. విద్యార్థులకు అల్పాహారం అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి దేశాలు రాలేదు. దాతలు, ఎన్జీవోలు, ప్రజా ప్రతినిధులు ముందుకు వచ్చి స్నాక్స్ అందించాలి.

*– ఎం రాజేందర్, డీఈవో, జయశంకర్ భూపాలపల్లి జిల్లా*

- **ప్రత్యేక తరగతుల్లో పాఠాలు అర్థంకాక సతమతం**
- **గతేడాది స్నాక్స్ అందించిన బీఆర్ఎస్ సర్కారు**
- **ప్రస్తుతం చేతులెత్తేసిన కాంగ్రెస్ ప్రభుత్వం**



పదో తరగతిలో మంచి మార్కులు సాధిస్తే విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు బాటలు పడతాయనే ఉద్దేశంతో జయశంకర్ భూపాలపల్లి జిల్లా విద్యాశాఖాధికారులు సర్కారు బడుల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. విద్యార్థులు ఇంటికి వెళ్లే సరికి సాయంత్రం 6 గంటలు అవుతున్నది. పాఠశాలలో మధ్యాహ్న భోజనం మినహా ఇతర ఆహారం ఏమీ అందడం లేదు. దీంతో వారు అర్ధాకలితో అలమటిస్తూ చదువుపై దృష్టి సారించలేక పోతున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో పదో తరగతి విద్యార్థులకు స్నాక్స్ అందించి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక విద్యార్థులకు అందించే స్నాక్స్‌కు బ్రేక్ పడింది.

**కేసీఆర్ ప్రభుత్వంలో స్నాక్స్**

జిల్లాలోని 121 ఉన్నత పాఠశాలల్లో మొత్తం 3449 మంది పదో తరగతి విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరిలో 1725 మంది బాలురు, 1724 మంది బాలికలు ఉన్నారు. వీరికి స్పెషల్ క్లాసులు ప్రారంభమైనప్పటి నుంచి బీఆర్ఎస్ ప్రభుత్వం పౌష్టికాహారంతో కూడిన స్నాక్స్ అందించింది. ఒక్కో విద్యార్థికి రోజుకు రూ.15 చొప్పున ప్రొటీన్లతో కూడిన శనగలు, బొబ్బర్లు, అనుములు, పల్లీలు, బెల్లం ముద్దలు, ఉడికించిన కోడిగుడ్లు, అరటిపండ్లు, పకోడి వంటి వాటిని అందజేసింది. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో స్నాక్స్ పథకం అటకెక్కింది. దీని ప్రభావం ఫలితాలపై పడుతుందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. మార్చి 21 నుంచి పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నందున వెంటనే ప్రభుత్వం స్నాక్స్ పథకాన్ని కొనసాగించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

## పాకాలలో బోటింగ్ ట్రయల్ రన్



**వరంగల్ జిల్లా ఖానాపురం మండలంలోని పాకాల సరస్సులో పర్యాటకుల బోటింగ్ కోసం ఏర్పాట్లు పూర్తయ్యాయి. తుంగబంధం తూము పక్కనే బోటింగ్ పాయింట్‌ను అటవీ అధికారులు సిద్ధం చేశారు. ఈ మేరకు ఆదివారం సరస్సులో పర్యాటకుల బోటుతో ట్రయల్ రన్ నిర్వహించారు. ఎలాంటి సమస్యలు తలెత్తలేదని, త్వరలోనే అధికారికంగా ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు.**

**- ఖానాపురం, జనవరి 5**



రైతు భరోసా మోసంపై పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది, బీఆర్ఎస్ నేతలు

# మరోసారి కాంగ్రెస్ మోసం

- **రైతు భరోసా రూ.12 వేలు ఇస్తామనడం సిగ్గుచేటు**
- **సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే రాజీనామా చేయాలి**
- **మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి**
- **క్యాబినెట్ నిర్ణయం హాస్యాస్పదం**
- **రైతు రుణ విముక్తి కమిషన్ మాజీ చైర్మన్ నాగుర్ల**

హనుమకొండ, జనవరి 5: రైతు భరోసా రూ.12 వేలు ఇస్తామని క్యాబినెట్ మీటింగ్‌లో నిర్ణయించడం రైతులను మరోసారి మోసం చేయడమేనని, దీనిని బీఆర్ఎస్ ఖండిస్తున్నదని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఆదివారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు నాగుర్ల వెంకటేశ్వర్లు, మర్రి యాదవరెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఓరుగల్లు వేదికగా 2022 మే 6న ఆర్ట్స్ కళాశాల మైదానంలో రాహుల్‌గాంధీ, ఖర్గే, ప్రియాంక గాంధీ ఆధ్వర్యంలో పీసీసీ అధ్యక్ష హోదాలో రేవంత్‌రెడ్డి రైతు భరోసా కింద ఎకరానికి రూ.15 వేలు ఇస్తామని హామీ ఇవ్వడంతో పాటు రైతు డిక్లరేషన్‌ను సైతం ప్రకటించాడన్నారు. కానీ రూ.12 వేలు ఇచ్చేందుకు క్యాబినెట్ నిర్ణయం తీసుకోవడం రైతులను విస్మయానికి గురిచేసిందన్నారు. వరంగల్ డిక్లరేషన్ అమలు చేయాల్సిందేనని, సీఎం రేవంత్‌రెడ్డి పచ్చి మోసగాడని, ఆయనకు సిగ్గు, నైతిక విలువలుంటే వెంటనే రాజీనామా చేయాలని పెద్ది డిమాండ్ చేశారు. నాడు రేవంత్‌రెడ్డి మాట్లాడిన మాటలను పెద్ది విలేకరులకు వినిపించారు. బోనస్ బోగస్ అయ్యిందని, కేవలం సన్నాలకే బోనస్ ఇచ్చి 30 శాతానికే చెల్లించారని అన్నారు. రుణమాఫీ కేవలం 30 శాతం అయ్యిందన్నారు. వరంగల్ జిల్లా నెక్కొండ మండలంలో 625 మంది రైతులకు మాఫీ కాలేదని పేర్కొన్నారు. రైతు డిక్లరేషన్‌ను ప్రకటించిన ఓరుగల్లు నుంచే రైతుల పక్షాన పోరాటం ప్రారంభిస్తామని వెల్లడించారు. సీఎం రేవంత్‌రెడ్డి విశ్వాస మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఇప్పటి వరకు రైతు భరోసాపై మాట్లాడడం లేదని సుదర్శన్‌రెడ్డి మండిపడ్డారు. యూరియా, డీఏపీ కొరత ఉందన్నారు. రైతులను మోసం చేసినందుకు రేవంత్‌రెడ్డిపై కొత్తచట్టం బీఎన్ఎస్ 318 ప్రకారం కేసు నమోదు చేయాలని, ఈ విషయంలో పోలీసులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. రైతుల తిరుగుబాటు ఓరుగల్లు నుంచే మొదలవుతుందన్నారు. రైతులను మోసం చేసిన కాంగ్రెస్ నాయకులు పల్లెల్లో తిరిగేందుకు జంకుతున్నారని అన్నారు. రైతు భరోసాను వాయిదా వేస్తూ వచ్చిన కాంగ్రెస్ సర్కారు ఎకరానికి రైతులకు రూ.17,500 బాకీ పడిందని, ఇప్పుడు రూ.6 వేలు ఇస్తే ఇంకా రూ.11,500 బాకీ ఉంటుందని, దీనిని రేవంత్‌రెడ్డి కడతాడా? అని ప్రశ్నించారు. సన్న, చిన్నకారు రైతులు ఉపాధి, వ్యవసాయ కూలీలుగా పని చేస్తారని, వీరికి ఇచ్చే రూ. 12 వేలు ఏమైందన్నారు. 54 లక్షల మంది జాబ్ కార్డులు కలిగి ఉన్నారని, వీరందరికీ రూ. 12 వేలు ఇవ్వాలని బీఆర్ఎస్ డిమాండ్ చేస్తున్నదన్నారు. రైతు భరోసాను కుదించేందుకు కాంగ్రెస్ సర్కారు చూస్తున్నదని ఆరోపించారు. వరంగల్‌కు వచ్చిన డిప్యూటీ సీఎం భట్టికి ఏమాత్రం నైతిక విలువలున్నా రైతులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

**సీఎంపై చీటింగ్ కేసు నమోదు చేయాలి : నాగుర్ల**

రైతు భరోసా విషయంలో క్యాబినెట్ నిర్ణయం హాస్యాస్పదంగా ఉందని రైతు రుణ విముక్తి కమిషన్ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి వ్యవహారం కొండను తవ్వి ఎలుకను పట్టినట్లు ఉందని ఆరోపించారు. ప్రజలు, రైతులను మోసం చేసిన సీఎంపై చీటింగ్ కేసు నమోదు చేయాలన్నారు. రైతుబంధు, రైతుబీమా, 24 గంటల ఉచిత కరెంటు, సాగునీరు లాంటి కార్యక్రమాలు చేపట్టిన మహనీయుడు కేసీఆర్ అన్నారు. రైతులకు బాకీపడ్డ నిధులపై అవగాహన కల్పించేందుకు రూపొందించిన పోస్టర్‌ను ఈ సందర్భంగా విడుదల చేశారు. సమావేశంలో పశ్చిమ నియోజకవర్గ కోఆర్డినేటర్ పులి రజినీకాంత్, నాయకులు భరత్‌కుమార్‌రెడ్డి, నయీముద్దీన్, బండి రజినీకుమార్, రవీందర్‌రావు, జానకిరాములు, చాగంటి రమేశ్, రఘు, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.



రైతులకు బాకీ పడిన రైతుబంధు వివరాలను వెల్లడిస్తున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

# హస్తం హామీలన్నీ అబద్ధాలే..

- **ఎకరాకు రూ.15 వేలని ఇప్పుడు రూ.12 వేలిస్తామనడం ఏంటి?**
- **పూర్తిస్థాయి రుణమాఫీ ఎందుకు చేయడం లేదు?**
- **కాంగ్రెస్ నాయకులు గ్రామాల్లో తిరిగే పరిస్థితి లేదు**
- **విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణా రెడ్డి**

కృష్ణ కాలనీ, జనవరి 5: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ అబద్ధాలేనని, చివరకు రైతుభరోసా ఎకరానికి రూ. 15 వేలు ఇస్తానని మోసం చేసిందని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి మండిపడ్డారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని కారల్ మార్క్స్ కాలనీలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రేవంత్‌రెడ్డి 6 గ్యారెంటీలు, 420 హామీలతో అధికారంలోకి వచ్చి 13 నెలలు అవుతున్నప్పటికీ ఏ ఒక్కటీ అమలు చేయలేదన్నారు. దీంతో కాంగ్రెస్ నాయకులు గ్రామాల్లో తిరిగే పరిస్థితి లేదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఓడిపోతుందనే భయంతో సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికలు నిర్వహించడం లేదన్నారు. ఇప్పటికే ప్రభుత్వంపై రైతులు తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారని, ఇది స్వయాన సీఎం రేవంత్‌రెడ్డి ఓ ప్రైవేట్ ఏజెన్సీతో చేయించిన సర్వేలో తేలిందన్నారు. దీంతో ఆయన పాలనకు తెలంగాణ ప్రజలు సున్నా మార్కులు వేశారని స్పష్టమైందన్నారు. ఎన్నికల సమయంలో వరంగల్‌లో నిర్వహించిన సభలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రూ. 15వేలు ఇస్తానని చెప్పి, నేడు రూ. 12 వేలు ఇస్తానని ప్రకటన చేసి రైతులను మోసం చేసిండన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం 2023 యాసంగికి ఇస్తానన్న రూ. 2, 500, 2024 సంవత్సరం రూ. 15 వేలు, రైతు భరోసా ఊసే లేదన్నారు. ప్రభుత్వం రైతుకు ఎకరాకు రూ. 17,500 రైతు భరోసా కింద బాకీ పడిందన్నారు. రూ. 2 లక్షల రుణమాఫీ కూడా ఇప్పటి వరకు కొద్ది మందికే అయ్యిందన్నారు. రైతులకు రైతు భరోసా, పూర్తి స్థాయిలో రుణమాఫీ, సన్న, దొడ్డు వడ్లకు రూ. 500 బోనస్, వృద్ధులు, వికలాంగులు, ఒంటరి మహిళలకు పెన్షన్లు, మహిళలకు రూ. 2,500, రూ. 500లకే గ్యాస్, నిరుద్యోగ భృతి, కల్యాణలక్ష్మి తులం బంగారం పథకాలను ఎప్పుడు ఇస్తారో ప్రకటించి, వాటి కార్యాచరణ చేపట్టాలని డిమాండ్ చేశారు. హామీలు నెరవేర్చే వరకు బీఆర్ఎస్ పార్టీ తరపున రాష్ట్ర ప్రభుత్వాన్ని నిద్రపోనివ్వమని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ వెంకటరాణి, వైస్ చైర్మన్ గండ్ర హరీశ్‌రెడ్డి, ఫ్లోర్ లీడర్ నూనె రాజు పటేల్, బీఆర్ఎస్ అర్బన్ అధ్యక్షుడు కటకం జనార్దన్, కౌన్సిలర్లు కొత్త హరిబాబు, మేకల రజిత, ఎడ్ల మౌనిక, టీబీజీకేఎస్ బ్రాంచ్ కమిటీ ఉపాధ్యక్షుడు బడితల సమ్మయ్య, జాగృతి జిల్లా అధ్యక్షుడు మాడ హరీశ్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు బండారి రవి, గడ్డం కుమార్ రెడ్డి, ఎండీ కరీం, సింగనవేణి చిరంజీవి, కరాటే శ్రీనివాస్, కృష్ణమూర్తి, మోకిడి అశోక్, టీబీజీకేఎస్ నాయకులు సదానందం, నరేశ్ నేత, అవినాష్‌రెడ్డి, మధు, యూత్ నాయకులు శ్రీకాంత్ పటేల్, భాస్కర్, శ్రీరామ్ పాల్గొన్నారు.

- **ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గత బీఆర్ఎస్ సర్కారు**
- **పట్టించుకోని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం**
- **ఏడాదైనా ఒక్క రూపాయి విదల్చని వైనం**
- **మరో రూ. 24 కోట్లు ఇస్తే మార్కెట్లు సిద్ధం**



*పిల్లర్లు, స్లాబ్‌ల స్థాయిలో నిలిచిపోయిన వరంగల్‌లోని లక్ష్మీపురం ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు*



*(ఇన్‌సెట్) మార్కెట్ డిజైన్‌తో ఏర్పాటు చేసిన బ్యానర్*

**గ్రేటర్‌లో నిలిచిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ల నిర్మాణాలు**

# పైసలిస్తేనే.. పనులు పూర్తయ్యేది

*కాంగ్రెస్ సర్కారు కొత్తగా ఒక్క అభివృద్ధి పనినీ ప్రారంభించలేదు.. కనీసం గత ప్రభుత్వ హయాంలోనే మొదలుపెట్టిన పనులను కొనసాగిస్తుందా? అంటే అదీ లేదు.. దీంతో నిధుల లేమితో పలు పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. ఇందుకు తార్కాణంగా హనుమకొండ, వరంగల్ ప్రాంతాల్లో చేపట్టిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్లు నిలుస్తాయి. నగర ప్రజలకు ఒకే చోట వెజ్, నాన్ వెజ్, ఫ్రూట్స్, ఫ్లవర్స్ మార్కెట్లు ఉండేలా గత బీఆర్ఎస్ సర్కారు ప్రతిష్టాత్మకంగా ఈ మార్కెట్లకు శ్రీకారం చుట్టింది. మొదటి విడతగా విడుదల చేసిన నిధులతో పనులు పిల్లర్లు, స్లాబ్ లెవల్‌కు చేరాయి. ఈ సమయంలో ఎన్నికలు రావడంతో ప్రభుత్వం మారింది. కొత్తగా ఏర్పాటైన కాంగ్రెస్ సర్కారు వీటి నిర్మాణానికి ఒక్క పైసా విదల్చలేదు. ఫలితంగా ఆరు నెలలుగా పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి.*

*- వరంగల్, జనవరి 5*

గ్రేటర్ వరంగల్‌లో మొదలు పెట్టిన ఇంటిగ్రేటెడ్ వెజ్, నాన్ వెజ్ మార్కెట్ల నిర్మాణ పనులు నిధులు లేక మధ్యలోనే నిలిచిపోయాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా వరంగల్ లక్ష్మీపురంలో వెజ్, నాన్ వెజ్, ఫ్రూట్స్, ఫ్లవర్స్, హనుమకొండ ఐబీ గెస్ట్ హౌస్ ప్రాంగణంలో వెజ్, నాన్ వెజ్ మార్కెట్ల నిర్మాణానానికి శ్రీకారం చుట్టింది. రూ. 24 కోట్ల అంచనాతో లక్ష్మీపురం, రూ. 9 కోట్లతో ఐబీ గెస్ట్‌హౌస్ మార్కెట్లకు ప్రణాళికలు సిద్ధం చేయగా, తొలి విడతలో ఒక్కో మార్కెట్‌కు రూ. 4.50 కోట్ల చొప్పున నిధులు కేటాయించడంతో పనులు మొదలయ్యాయి. అయితే కొత్తగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది గడిచినా నయా పైసా విడుదల చేయకపోవడంతో మార్కెట్ల పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. ఈ పనులకు నిధులెట్లా సర్దుబాటు చేయాలో తెలియక కార్పొరేషన్ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వానికి లేఖలు రాసి చేతులు దులుపుకున్నారు.

**నిధులు లేక నిలిచిన పనులు**

రూ. 24 కోట్ల అంచనాతో వరంగల్ లక్ష్మీపురంలో వెజ్, నాన్ వెజ్, ఫ్రూట్స్, ఫ్లవర్స్ మార్కెట్లు ఒకే ప్రాంగణం (ఇంటిగ్రేటెడ్)లో ఉండేలా డిజైన్ చేశారు. ముందస్తుగా రూ. 4.50 కోట్లు గత బీఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేసింది. ప్రతినెలా గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్‌కు విడుదల చేసే పట్టణ ప్రగతి నిధుల నుంచి మిగతా నిధులు సర్దుబాటు చేసుకొని పనులు పూర్తి చేయాలని ఆదేశించింది. మొదటి విడత నిధులతో కొన్ని బ్లాకుల్లో స్లాబ్‌లు పూర్తిచేయగా, మరికొన్ని పిల్లర్ల స్థాయిలో ఉన్నాయి. అలాగే హనుమకొండలోని ఐబీ గెస్ట్ హౌస్ ప్రాంగణంలో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ వెజ్, నాన్ వెజ్ మార్కెట్ నిర్మాణం సైతం సగంలోనే ఆగిపోయింది. ఈ మార్కెట్‌కు కూడా గత ప్రభుత్వం రూ. 4.50 కోట్లు విడుదల చేయగా, వాటితోనే సగం పనులు పూర్తయ్యాయి. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయ్యాక పట్టణ ప్రగతి నిధులు నిలిపివేయడంతో మార్కెట్ల నిర్మాణ పనులు నిలిచిపోయాయి. వీటిని పూర్తి చేయాలంటే ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు విడుదల చేయాల్సి ఉంది. ఈ విషయమై బల్దియా అధికారులను అడిగితే ప్రభుత్వానికి లేఖ రాశామని, నిధులు వస్తే పనులు చేపడుతామని అంటున్నారు.



హనుమకొండలోని ఐబీ గెస్ట్‌హౌస్ ప్రాంగణంలో మధ్యలోనే ఆగిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణ పనులు

**నయా పైసా ఇవ్వని ప్రభుత్వం**

గ్రేటర్‌లో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ వెజ్, నాన్ వెజ్ మార్కెట్లకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటి వరకు నయా పైసా విడుదల చేయలేదు. గత ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతోనే సగం పనులు పూర్తిచేశారు. గత ఆరు నెలలుగా నిర్మాణాలు పూర్తిగా నిలిచిపోయాయి. రెండు మార్కెట్లకు కలిపి రూ. 24 కోట్లు మంజూరు చేస్తే పనులు పూర్తయి అందుబాటులోకి వచ్చే అవకాశాలున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఇంటిగ్రేటెడ్ మార్కెట్ల కోసం ప్రత్యేకంగా నిధులు విడుదల చేయాలని ప్రజలు కోరుతున్నారు.

# పుట్టగొడుగుల్లా డయాగ్నస్టిక్ సెంటర్లు

- **అనుమతి లేకుండా ఏర్పాటు..**
- **ఆఫర్స్ పేరిట రక్త పరీక్షలు**
- **సీకేఎం కాలేజీ మైదానంలో బోగస్ హెల్త్ కేర్ సెంటర్**
- **స్థానికుల ఫిర్యాదుతో టీఎంసీ పీఆర్ చైర్మన్ నరేశ్‌కుమార్ తనిఖీ**



కాకతీయ హెల్త్ కేర్ సెంటర్ నిర్వాహకుడిని ప్రశ్నిస్తున్న మెడికల్ కౌన్సిల్ పబ్లిక్ రిలేషన్ కమిటీ చైర్మన్ డాక్టర్ నరేశ్‌కుమార్

పోచమ్మమైదాన్, జనవరి5: పుట్టగొడుగుల్లా ప్రభుత్వ అనుమతి లేకుండా డయాగ్నస్టిక్ సెంటర్లు పుట్టుకొస్తున్నాయి. వైద్యాధికారుల అనుమతి లేకుండా ఆఫర్ల పేరిట కొంతమంది ల్యాబ్ టెక్నీషియన్లు ప్రజలను మోసం చేస్తున్నారు. ఆన్‌లైన్‌లో తక్కువ ధరలకు టెస్టులు చేస్తున్నామని ప్రకటనలు ఇస్తూ ఇష్టారీతిన పరీక్షలు చేసి రిపోర్టులు ఇస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇలాంటిదే వరంగల్ దేశాయిపేటలో వెలుగు చూసింది. వివరాలిలా ఉన్నాయి.. సీకేఎం కళాశాల మైదానంలో ప్రభుత్వ అనుమతి లేకుండా కాకతీయ హెల్త్ కేర్ సెంటర్ పేరుతో వైద్య శిబిరం ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహిస్తున్నాడు. స్థానికుల ఫిర్యాదు మేరకు తెలంగాణ మెడికల్ కౌన్సిల్ పబ్లిక్ రిలేషన్ కమిటీ చైర్మన్ డాక్టర్ వీ నరేశ్‌కుమార్ తనిఖీ చేశారు. రిపోర్టులపై పాథాలజిస్టు డాక్టర్ సుంకరి నరేశ్‌బాబు, డాక్టర్ ప్రతిమ పేర డిజిటల్ సంతకాన్ని ఉపయోగించినట్లు గుర్తించారు. సదరు డాక్టర్‌ను సంప్రదించగా హెల్త్ కేర్ సెంటర్‌కు, నిర్వాహకుడికి తనకు ఎలాంటి సంబంధం లేదని చెబుతున్నాడని నరేశ్‌కుమార్ తెలిపారు. ముఖ్యంగా ల్యాబ్ టెక్నీషియన్ ఇచ్చిన రిపోర్టులు కూడా ఫేక్ అని తేలడంతో వైద్యాధికారులకు ఫిర్యాదు చేశామని, ఇద్దరు డాక్టర్లకు మెడికల్ కౌన్సిల్ నుంచి నోటీసులు ఇవ్వనున్నట్లు వివరించారు.

**అక్కడ అంతా బోగస్..**

జనగామ జిల్లాకు చెందిన ముక్క అరుణ్ కుమార్ ల్యాబ్ టెక్నీషియన్ చదివి, ప్రభుత్వ అనుమతి లేకుండా కాకతీయ హెల్త్ కేర్ సెంటర్, జేపీఎన్ రోడ్డు, వరంగల్ పేరు మీద కొన్ని పుస్తకాలు ముద్రించి, తక్కువ ధరలకు ప్రజలకు రక్త పరీక్షలు చేస్తున్నామంటూ శిబిరం నిర్వహిస్తున్నాడు. అయితే ఇందులో పేర్కొన్న అడ్రస్‌లో అసలు ల్యాబ్ కానీ, పరీక్షల పరికరాలు లేవని తేలింది. అలాగే జిల్లా అధికారుల అనుమతి కూడా లేదు. 11 రకాల పరీక్షలకు రూ. 499 అని ప్రజలను మోసం చేస్తున్న నిర్వాహకుడిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## కోటను కమ్మేసిన పొగమంచు

*చారిత్రక ఓరుగల్లు కోటలోని శిల్ప సంపదను ఆదివారం పొగమంచు కమ్మేసింది. శిల్పాలను తాకుతున్న భానుడి లేలేత కిరణాలు.. కురుస్తున్న పొగమంచును వాకర్స్‌తోపాటు ప్రకృతి ప్రేమికులు ఆస్వాదించారు.* *–ఖిలావరంగల్, జనవరి 5*

